క్లుప్తంగా

పౌష్టికాహారంపై గర్భిణులకు అవగాహన

సారవకోట: గర్భిణులు తప్పనిసరిగా సమతుల్య ఆహారం తీసుకోవాలని సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో హెచ్.కె.కామాక్షి అన్నారు. అలుదు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మహా కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు శుక్రవారం అవగాహన కల్పించారు. గర్భం దాల్చినప్పటి నుంచి విటమిన్లు, ఐరన్ ఉన్నటువంటి ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పౌష్టికాహార ప్రదర్శన చేపట్టారు. సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న సీఐ ప్రసాదరావు

నరసన్నపేట: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావు అన్నారు. ఎవరైనా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తే విధిగా హాజరు కావడం ద్వారా పిల్లల్లో జ్ఞాపకశక్తి పెరగడంతోపాటు నైపుణ్యం మెరుగు పడుతోందన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక శర్వాణి విద్యాలయంలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేసిన సందర్భంగా సీఐ మాట్లాడారు. భగత్‌సింగ్ జీవిత విశేషాలను వివరించారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

37 ఏళ్లుగా గణనాథుడికి పూజలు


పూజలందుకుంటున్న అల్లువీధి వినాయకుడు

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరులోని అల్లు వీధిలో ఏటా వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఇలా 37 ఏళ్లుగా నిరాటంకంగా కొనసాగుతోంది. తొలుత 1987 సంవత్సరంలో చిన్నపిల్లలు అడుగు ఎత్తుతో మట్టి వినాయకుడి విగ్రహాన్ని అల్లు రాములు ఇంటి వద్ద ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి 25 సంవత్సరాలపాటు రాములు ఇంటి ముందు మండపం ఏర్పాటు చేసి ఉత్సవాలను నిర్వహించేవారు. ఆ తరువాత గణనాథుని విగ్రహం ఎత్తు పది అడుగులకు పెంచడంతో అదే వీధిలో ఖాళీ స్థలంలో మండపాన్ని ఏర్పాటు చేసి నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ప్రతిష్ఠించిన విగ్రహాన్ని అక్టోబర్ ఒకటో తేదీన నిమజ్జనం చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

తక్షణసాయం అందజేత

సారవకోట: చీడిపూడి గ్రామానికి చెందిన తురాళ్ల కృష్ణ ఇటీవల మృతి చెందారు. ఇతను వైఎస్సార్ బీమా పాలసీదారుడు. దీంతో అతని కుటుంబానికి తక్షణ సాయంగా రూ.పదివేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని శుక్రవారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నిక్కు కృష్ణారావు, గేదెల శరత్, చిట్టియ్య ఉన్నారు.

వైద్యుడు నియామకం

కొత్తూరు: కొత్తూరు సీహెచ్‌సీకి ఎనస్తీసియ వైద్యుడిగా డాక్టర్ శరత్‌ని ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకూ ఈ పోస్టు ఖాళీగా ఉంది.

శాస్త్రవేత్త స్వామినాథన్‌కు ఘనంగా నివాళి

హిరమండలం: వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని జగన్నాథపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.సురేష్ అన్నారు. స్వామినాథన్ సంతాపసభను పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వ్యవసాయరంగానికి స్వామినాథన్ చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు.

పెద్దపద్మాపురంలో భూసర్వే


డ్రోన్‌తో సర్వేకు సిద్ధమవుతున్న సిబ్బంది

మెళియాపుట్టి: భూసమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత భూసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తహసీల్దార్ సరోజిని అన్నారు. పెద్దపద్మాపురం గ్రామంలో భూముల రీసర్వేను డ్రోన్ ద్వారా శుక్రవారం నిర్వహించారు. సర్వేకు రైతులు సహకరించాలన్నారు. ఆర్ఐ వైకుంఠరావు ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి


పాతపట్నం: ఎమ్మెల్యే రెడ్డి శాంతికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు సదాశివ

పాతపట్నం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరంలాంటిదని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండల కేంద్రంలోని శాంతినగర్–3లో గ్రామంలో బైదలాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేలో భాగంగా ఎమ్మెల్యేకు వైద్య పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుటుంబంలో ప్రతిఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కుటుంబ సభ్యులు వైద్య వివరాలు నమోదు చేసుకుంటామన్నారు. సర్వేలో బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, కంటి తదితర ఇతర ఆరోగ్య పరీక్షలు చేయడంతోపాటు గుర్తించిన వ్యాధుల తీవ్రతను బట్టి తదుపరి చర్యలు వైద్యులు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో బైదలాపురం, ఎల్.ఎన్.పేట, తురకపేట పీహెచ్‌సీ వైద్యులు జి.సదాశివ, డివి.లక్ష్మి,దీప్, సునీత, కర్రి లక్ష్మీనారాయణ, సనపల కిరణ్‌కుమార్, మండల సచివాలయ కన్వీనర్ సూర్యం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో సర్వే..

ఆమదాలవలస రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా రామచంద్రాపురం గ్రామంలో వైద్య సిబ్బంది సర్వే నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారికి బీపీ, సుగర్, హిమోగ్లోబిన్ వంటి పరీక్షలు నిర్వహించి వైద్య శిబిరానికి టోకెన్‌లను అందజేశారు. అక్టోబర్ నాలుగో తేదీన గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరం నిర్వహిస్తామని..సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటి నుంచి శిబిరాలు

ఎల్.ఎన్.పేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి శనివారం నుంచి అక్టోబర్ 13వ తేదీ వరకు గ్రామ సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో ఆర్.కాశీప్రసాద్ తెలిపారు. తొలిరోజున బొర్రంపేట, పెద్దకొల్లివలస గ్రామ సచివాలయాల వద్ద డాక్టర్ ఎ.లక్ష్మీదీప్, అక్టోబర్ మూడో తేదీన పెద్దకొల్లివలస వద్ద డాక్టర్ పి.ప్రియాంక, నాలుగున గొట్టిపల్లిలో డాక్టర్ ఎస్ సునీత, ఐదున మిరియాపల్లిలో డాక్టర్ బి.నీతు, ఆరున బొత్తాడసింగిలో డాక్టర్ పి.ప్రియాంక, ఏడున టి.కె.పురంలో డాక్టర్ బి.నీతు, 9న కరకవలసలో డాక్టర్ ఎ.లక్ష్మీదీప్, పదో తేదీన చొర్లంగిలో డాక్టర్ పి.ప్రియాంక, 11న పెద్దకోట–2లో డాక్టర్ ఎస్.సునీత, 12న రావిచెంద్రిలో డాక్టర్ బి.నీతు, వచ్చే నెల 13న యంబరాం గ్రామ సచివాలయం వద్ద జరిగే వైద్య శిబిరంలో డాక్టర్ ఎస్ సునీత పాల్గొంటారని ఎంపీడీవో తెలిపారు.


నరసన్నపేట: లింగాలపాడులో సర్వేని పరిశీలిస్తున్న సుజాత


పాతపట్నం: మాట్లాడుతున్న సూర్యం

ఆరోగ్య సురక్షపై సమీక్ష

మెళియాపుట్టి: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతీఇంటికి వైద్యసేవలు అందాలని ఎంపీడీవో చంద్రకుమారి సర్పంచ్ బైపోతు ఉదయ్ ఉదయ చంద్రరావు అన్నారు. శనివారం నుంచి ప్రారంభంకానున్న జగనన్న ఆరోగ్యసురక్షపై పెద్ద లక్ష్మీపురం గ్రామంలో శుక్రవారం సిబ్బంది, ప్రజలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే రెడ్డిశాంతి పెద్దలక్ష్మీపురం గ్రామంలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతర మేరాదేశ్–మేరా మట్టి కార్యక్రమంలో భాగంగా మట్టి, బియ్యాన్ని సేకరించారు. చాపర పీహెచ్‌సీ వైద్యులు హేమంత లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు వట్టికుళ్ల శంకరరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సురక్ష షెడ్యూల్ ఖరారు

జలుమూరు: మండలంలో శనివారం నుంచి అక్టోబర్ 31 వరకూ జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష షెడ్యూల్‌ను ఖరారు చేసినట్లు ఎంపీడీవో ఎల్.వి.అప్పారావు శుక్రవారం తెలిపారు. 21 సచివాలయాలను రెండు టీములుగా విడదీసి ఆరోగ్య సురక్ష కార్యక్రమం తొమ్మిది గంటలకు ఆయా సచివాలయాలలో నిర్వహించనున్నామన్నారు. 30న లింగాలవలస, 3న అందవరం, 4న కొమనాపల్లి, 5న మర్రివలస, 6న పర్లాం, 7న శ్రీముఖలింగం, 9న యలమంచిలి, 11న అక్కురా డు, 12న గొటివాడ, 13న అల్లాడ, 16 పాగోడు, 17న చల్లవానిపేట, 18న జోనంకి, 19న తలతరి యా, 20న వెంకటాపురం, 25న కరవంజ, 26న రా ణ, 27న పెద్ద దూగాం, 28న రావిపాడు, 30న తిమడాం, 31న టెక్కలిపాడు గ్రామాల్లో జలుమూ రు, అచ్యుతాపురం, సైరిగాం పీహెచ్‌సీ వైద్యాధికారుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

నరసన్నపేట: ప్రజలందరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఉర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి సుజాత అన్నారు. లింగాలపాడులో పీహెచ్‌సీ సిబ్బంది నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్షా సర్వేని పరిశీలించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలని సిబ్బందికి సూచించారు.

సద్వినియోగం చేసుకోవాలని

పాతపట్నం: జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సచివాలయ మండల కన్వీనర్ ఎనుగుతల సూర్యం అన్నారు. సింగుపురం గ్రామ సచివాలయం వద్ద సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, వలంటీర్లతో జగనన్న ఆరోగ్య సురక్షపై సమావేశం నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ జీవన్, మాజీ సర్పంచ్ చీకటి పద్మరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఆమదాలవలస రూరల్: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది


మెళియాపుట్టి: మాట్లాడుతున్న సర్పంచ్ ఉదయ చంద్రరావు

సొసైటీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

- కదులుతున్న చంద్రబాబు అవినీతి పునాదులు
- పోలాకి పీఏసీఎస్ మహా జనసభలో ఎమ్మెల్యే కృష్ణదాస్

పోలాకి: వ్యవసాయ పరపతి సంఘాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం కట్టుబడి ఉందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. డీసీసీబీ అధ్యక్షుడు కరిమి రాజేశ్వరరావు అధ్యక్షతన పోలాకి పీఏసీఎస్ మహాజనసభ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ.. సీఎం జగన్ దృష్టిలో వ్యవసాయం అత్యంత ప్రాధాన్యతా అంశమన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా దేశంలోనే ఆదర్శంగా అన్నదాతకు సేవలందిస్తున్నామని చెప్పారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హయాంలో సొసైటీలకు మంచిరోజులు ఉండేవని.. తరువాత మళ్లీ ఆనాటి వైభవం జగన్‌తోనే సాధ్యపడుతోందన్నారు. చంద్రబాబు రాజకీయ జీవితం మొత్తం కుట్ర, కుతంత్రాలతోనే గడిచిందని.. ఇప్పుడు ఆయన అవినీతి సామ్రాజ్యం పునాదులు కదులుతున్నాయని అన్నారు. అవినీతి కేసులో చంద్రబాబును అరెస్ట్ చేస్తే జగన్‌ను విమర్శిస్తున్న వాళ్లకు చట్టంపై అవగాహన లేదని చెప్పారు. నిజంగా చంద్రబాబు అరెస్టుతో ప్రజల్లో సానుభూతి పెరిగిపోతే కోట్ల రూపాయలు పెట్టి దేశంలోనే పేరున్న లాయర్లను పెట్టుకోవడం దేనికని.. మరి కొంతకాలం జైల్లోనే ఉండవచ్చుకదాని వ్యాఖ్యానించారు. అబ్బాకొడుకుల వ్యవహారం అవినీతి కేసులకు కేరాఫ్‌గా ఉందన్నారు. అనంతరం ప్రమాదవశాత్తు మృతి చెందిన రైతుల కుటుంబాలకు బీమా చెక్కులను పంపిణీ చేశారు. అంతకు ముందు సొసైటీల ప్రాధాన్యతను డీసీసీబీ సీఈవో వరప్రసాద్ వివరించారు. డీసీసీబీ చైర్మన్ రాజేశ్వరరావు మాట్లాడుతూ.. సంఘం ద్వారా రైతులకు అన్ని రకాలుగా తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ బసవలింగం, మండలపరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, నరసన్నపేట డీసీసీబీ మేనేజర్ సీతారాం, పీఏసీఎస్ సీఈవో రాంబాబు పాల్గొన్నారు.

ఊరూరా 'నామట్టి-నాదేశం'


నరసన్నపేట: ప్రతిజ్ఞ చేస్తున్న సత్యవరం స్కూల్ విద్యార్థులు

నామట్టి–నాదేశం కార్యక్రమాన్ని ఊరూరా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టి, బియ్యాన్ని సేకరించి కలశాల్లో వేశారు. విద్యార్థులు జాతీయజెండాలను పట్టుకొని ర్యాలీలు చేశారు. మహనీయుల త్యాగాలను స్మరించుకున్నారు. జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సరుబుజ్జిలి: సింధువాడలో మట్టిని సేకరిస్తున్న దృశ్యం

'జగనన్నకు చెబుదాం'కు 49 వినతులు

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలసలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 49 వినతులు అందినట్టు అధికారులు తెలిపారు. జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంతో పాటు ప్రతి మండలంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి గణపతి తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కరించడానికే ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. అర్హత గల లబ్ధిదారులు ఎవరు ఉన్నా నేరుగా దరఖాస్తులు చేసుకుంటే వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కాగా వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని నెల్లిమెట్ట గ్రామానికి చెందిన మొదలవలస మల్లేశ్వరరావు వినతి అందజేశారు. కాలువలో మురుగునీరు నిలిచిపోతుందని.. సమస్య పరిష్కరించాలని ఆమదాలవలస మున్సిపాలిటీ 17వ వార్డుకు చెందిన బొడ్డేపల్లి మోహనరావు విజ్ఞప్తి చేశారు. పింఛన్ల కోసం 12, భూమి సమస్యలు పరిష్కరించాలని 14, హౌసింగ్ బిల్లులు మంజూరు చేయాలని ఏడు, విద్యాశాఖకు సంబంధించి రెండు, పంచాయతీరాజ్‌కు ఐదు, విద్యుత్, వ్యవసాయశాఖలకు సంబంధించి మొత్తం 49 వినతులు అందాయి. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వెంకట్రామన్, ఏఎస్పీ తిప్పేస్వామి, డీఎస్పీ శృతి, ఆర్డీవో శాంతి, తహసీల్దార్ గణపతిరావు, ఎంపీడీవో ఎస్.వాసుదేవరావు, సర్వశిక్షా పీవో జయప్రకాశ్ పాల్గొన్నారు.


వినతులను పరిశీలిస్తున్న అధికారులు

సీఎం, ఎమ్మెల్యేకు వైద్య ఉద్యోగుల కృతజ్ఞతలు

ఎల్.ఎన్.పేట: ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు వైఎస్సార్‌సీపీ సర్కార్ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ ఇటీవల జీవో విడుదల చేసింది. ఈ సందర్భంగా పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైద్య ఉద్యోగులు కృతజ్ఞతలు తెలియజేశారు. పాతపట్నం నియోజకవర్గం పరిధిలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఎమ్మెల్యే రెడ్డి శాంతిని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసి ఆనందం వ్యక్తం చేశారు. ఉద్యోగులు సనపల కిరణ్‌కుమార్, మల్లేశ్వరరావు, విఠల్, పార్వతీశం తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యే రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న వైద్య ఉద్యోగులు

బోధనోపకరణాల వితరణ

ఆమదాలవలస: ప్రకాశం జిల్లాకు చెందిన ఎన్ఆర్ఐ గోరింట్ల వాసుబాబు రూ.30 వేల విలువచేసే బోధనోపకరణాలను మున్సిపాలిటీ పరిధి నాలుగో వార్డులోని గేదెలవానిపేట మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలకు వితరణగా పంపించారు. వీటిని పాఠశాలలో శుక్రవారం ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ సాధు కామేశ్వరరావు మాట్లాడుతూ.. వాసుబాబు సమకూర్చిన సామగ్రిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. వాసుబాబు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 పాఠశాలలకు బోధన పరికరాలు అందజేసినట్టు చెప్పారు. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు కింజరాపు అప్పన్న, బి.కృష్ణ, ఎం.విజయలక్ష్మి, బి.రామారావు, పి.వి.రమణమ్మ, ఎస్.ధనుంజయరావు, స్కూల్ కమిటీ చైర్మన్ సాధు సింహాచలం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


బోధనోపకరాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

ఎల్.ఎన్.పేట: రావిచెంద్రి వద్ద ఉన్న 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. కొద్ది రోజుల క్రితం పిడుగుపడి సబ్‌స్టేషన్‌లో విలువైన పరికరాలు కాలిపోయాయి. రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. పక్క మండలాల నుంచి విద్యుత్ సరఫరా పునరుద్ధరించినప్పటికీ అప్పుడప్పుడు సరఫరాలో అంతరాయం కలుగుతునే ఉంది. కాలిపోయిన పరికరాల స్థానంలో కొత్త పరికరాలను అమర్చేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఆయా పనులు రెండు రోజులుగా ముమ్మరంగా జరుగుతున్నాయని ఏఈ రాజశేఖర్ తెలిపారు. సుమారు రూ.5 కోట్లు విలువ చేసే పరికరం ఒకటి రావలసి ఉందన్నారు.


పనులు చేపడుతున్న సిబ్బంది

పేదలకు కార్పొరేట్ వైద్యం



మాట్లాడుతున్న జైప్రతాప్‌కుమార్

పొందూరు: పేదలందరికీ కార్పొరేట్‌స్థాయిలో వైద్యం అందుబాటులో ఉండాలన్న ఆశయంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి బండారి జైప్రతాప్‌కుమార్ అన్నారు. స్థానిక దివ్య జ్ఞాన సమాజం సమీపంలో ఉన్న సచివాలయంలో సచివాలయం–1, 2, 3 పరిధిలోని గృహ సారథులు, వలంటీర్లు, ఇన్‌చార్జిలతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వచ్చేనెల 10న పొందూరు రెండో సచివాలయం, 20న మూడో సచివాలయం పరిధిలో ఉన్న ప్రజలకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌వో మోహనరావు, జేఏసీ కన్వీనర్ బాడాన క్రిష్ణ, ఉపసర్పంచ్ అనకాపల్లి గోవింద, ఈవోపీఆర్‌డీ సింహాచలం, కార్యదర్శి రమేష్ పాల్గొగన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలి

కొత్తూరు: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ రేవతి అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయములో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో శుక్రవారం సమావేశమయ్యారు. లక్ష్యం మేరకు మండలంలో 1862 ఎకరాల్లో ప్రకృతి సాగు విధానంలో పంటలను పండించేలా రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజల్లో భక్తిభావం పెరగాలి


మాట్లాడుతున్న రామకృష్ణశర్మ

సారవకోట: ప్రజల్లో భక్తిభావం పెరగాలని ప్రవచనకర్త ఇప్పిలి రామకృష్ణ అన్నారు. కిన్నెరవాడ గ్రామంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సత్సంగమ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తిభావాన్ని అలవర్చుకోవడం ద్వారా సమాజం సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతోందన్నారు. రామాయణ, మహాభారతంలోని పలు ముఖ్యఘట్టాలను వివరించారు. అర్చకుడు సిద్ధయ్యస్వామి, ముద్దన రమణమూర్తి, బోయిన వెంకటరమణ, వాన కనకయ్య పాల్గొన్నారు.

హిందీతో జాతీయ సమైక్యత

సరుబుజ్జిలి: హిందీభాష ద్వారా జాతీయ సమైక్యత సాధ్యపడుతుందని రొట్టవలస జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె.రామకృష్ణారావు అన్నారు. జాతీయ పక్షోత్సవాలు ముగింపు సందర్భంగా శుక్రవారం స్థానిక హైస్కూల్ ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కమిటీ చైర్మన్ మందపల్లి రామకృష్ణారావు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు బసివాడలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

జలుమూరు: బసివాడ గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం ఉదయం నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ వాన గోపి శుక్రవారం తెలిపారు. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు.

అంగన్‌వాడీలకు బకాయి వేతనం విడుదల

సారవకోట: సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి జలుమూరు మండలంలోని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలకు గౌరవ వేతనం బకాయిలు విడుదలైనట్లు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ శాంతిశ్రీ తెలిపారు. 2020లో జలుమూ రు సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు కోటబొమ్మాళి ప్రాజెక్టు పరిధిలో ఉన్న సమయంలో సాంకేతిక కారణాల వలన ఒక నెల గౌరవ వేతనం వారి ఖాతాలకు జమకాలేదు. దీనిపై ఆయా కార్యకర్తలు తమ దృష్టికి తీసుకురావడంతో దా పై ఉన్నతాధికారులతో మాట్లాడంతో వేతనాలు శుక్రవారం వారి బ్యాంకు ఖాతాల కు బకాయి జీతం జమైనట్లు పేర్కొన్నారు.

ఏకరూప దుస్తులు పంపిణీ

సరుబుజ్జిలి: ఏకరూప దుస్తులను అంగన్‌వాడీ సిబ్బంది ధరించి విధులకు హాజరుకావాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.రత్నాంజలి అన్నారు. సరుబుజ్జిలి సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సిబ్బందికి ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు.

గిరిశిఖర గ్రామంలో వైద్య సేవలు

మెళియాపుట్టి: మండలంలో గిరిశిఖర గ్రామమైన చందనగిరిలో శుక్రవారం వైద్య సేవలను అందించారు. ఇల్లాయిపురం సచివాలయం ఎంఎల్‌హెచ్‌పీ సంతోష్‌కుమార్ పర్యవేక్షించారు. సర్పంచ్ జనార్దన్ ఉన్నారు.

జల్లువానిపేటలో సామూహిక వ్రతాలు

నరసన్నపేట: జల్లువానిపేటలోని రామమందిరం వద్ద టీటీడీ ధార్మిక మండలి ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను శుక్రవారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ తిరుమలరావు సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో వంద జంటలు వ్రతాల్లో పాల్గొన్నాయి.

పోటీతత్వంతో విద్యార్థులకు గుర్తింపు

జలుమూరు: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవడం ద్వారా గుర్తింపు సాధ్యమని ఎంఈవో బి.మాధవరావు అన్నారు. అల్లాడ, శ్రీముఖలింగం, అచ్యుతాపురం, జలుమూరు, చల్లవానిపేట పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఆచార్య దేవోభవ అనే అంశంపై శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో విజేతలకు నియోజకవర్గస్థాయిలో పోటీలు ఉంటాయన్నారు.

గుండె సంరక్షణపై అవగాహన

పాతపట్నం:మానవుల జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులు వల్ల గుండె జబ్బులు పెరుగుతున్నాయని.. అందువల్ల ప్రతిఒక్కరూ గుండెను కపాడుకోవాలని ప్రధానోపాధ్యాయుడు ఎస్.వైకుంఠరావు అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గుండె సంరక్షణపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. సైన్సు ఉపాధ్యాయుడు ఎన్టీ రామారావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ జింక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు.

సక్రమంగా మెనూ అమలు

బూర్జ: మధ్యాహ్న భోజనంలో మెనూను సక్రమంగా అమలు చేయాలని ఎంపీపీ కర్నేన దీప అన్నారు. పాలవలస హైస్కూల్, కొల్లివలస కేజీబీవీని ఎంపీపీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని పిల్లల తల్లిదండ్రుల నుంచి వస్తున్న ఆరోపణ నేపథ్యంలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె తనిఖీ చేశారు. భోజనం రుచిగా లేకపోతే సంబంధిత సిబ్బందిపై ఉన్నతాధిరులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కొల్లివలస కేజీబీవీ ప్రిన్సిపాల్ కె.గాయత్రి ఉన్నారు.

వినాయక మండపం వద్ద అన్నదానం

ఎల్.ఎన్.పేట: శ్యామలాపురం (పాడలి) వంశధార పునరావాస కాలనీలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మండపం వద్ద శుక్రవారం అన్నదానం చేశారు. శ్యామలాపురం పునరావాస కాలనీలో ఉంటున్న పాడలి, తులగాం, గార్లపాడు వంశధార నిర్వాసితులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.